నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: బేగంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శాంతిబాగ్, శివబాగ్, కేకే జోన్ హోటల్, మధ్యాహ్నం 12 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు డీకే రోడ్డు, రోశయ్య లేన్, శివబాగ్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా(కిలో) రూ.13, నల్లవంకాయ రూ.28, పొడుగు వంకాయ రూ.23, బెండకాయ రూ.40, పచ్చిమిర్చి రూ.45, బజ్జీమిర్చి రూ.40, క్యాప్సికమ్ రూ.40, పచ్చకాకర రూ.31, పందిరి బీర రూ.35, క్యాబేజీ రూ.13, క్యారెట్ రూ.23, దొండ రూ.35, గుండుబీన్స్ రూ.35, గింజ చిక్కుడు రూ.45, గోకరకాయ రూ. 28, కీర రూ.23, దోసకాయ రూ.18, బీట్‌రూట్ రూ.19, ఉల్లిగడ్డ రూ.30, ఆలుగడ్డ రూ.27, చామగడ్డ రూ.40, మొరంగడ్డ రూ.28, కందగడ్డ రూ. 35, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.9, మునగకాయ రూ.10–12, ముల్లంగి రూ.4–5. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి


కంది శైలజ, కార్పొరేటర్

బౌద్ధనగర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు జోరుగా సాగాయని డివిజన్ కార్పొరేటర్ కంది శైలజ అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో పేదోళ్లకు ఏ లబ్ధీ చూకూరడం లేదన్నారు. రేషన్ కార్డుల విషయంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తోందన్నారు. పదేళ్ల పాలనలో 6 లక్షలకుపైగా రేషన్ కార్డులు, 20 లక్షల లబ్ధిదారులకు అదనంగా రేషన్ ఇచ్చినట్లు తెలిపారు. నిరుపేదలకు రేషన్ కార్డులు రావాలనే ఆలోచనతో ఆదాయ పరిమితిని కేసీఆర్ సడలించారని చెప్పారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో రేషన్ కార్డులపై సన్నబియ్యం సరఫరా చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చి 400 రోజులు గడుస్తున్నా అతీగతీ లేదన్నారు. పేదలకు రేషన్ కార్డులకు దూరం చేసేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోందని ఆరోపించారు.

సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి


ఎల్‌ఓసీ చెక్కును అందజేస్తున్న మహేశ్వర్ రెడ్డి

కంటోన్మెంట్: అత్యవసర వైద్య సదుపాయానికి ముఖ్యమంత్రి సహాయనిధి వరంలా ఉపయోగపడుతుందని బోర్డు ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి (జేఎమ్మార్) అన్నారు. బోయిన్‌పల్లికి చెందిన సలీమా బేగం తీవ్ర అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వైద్య ఖర్చుల నిమిత్తం ఆమెకు రూ.2 లక్షలు అవసరం కాగా, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి సిఫారసుతో సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేయించారు. ఈ మేరకు రూ.2 లక్షల ఎల్‌ఓసీ మంజూరు కాగా, సలీమా బేగం కుమారుడికి సంబంధిత చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బోయిన్‌పల్లి మైనారిటీ ప్రెసిడెంట్ హసీబ్ ఖాన్, రిజ్వాన్, ఇమ్రాన్, చోటూ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

అడ్డగుట్ట: సీపీఎం రాష్ట్ర నాలుగో మహాసభల పోస్టర్‌ను ఆ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కార్యదర్శి వెంకటేష్ మంగళవారం ఆవిష్కరించారు. వెంకటేష్ మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు సంగారెడ్డిలో మహాసభలు జరుగుతాయని చెప్పారు. సీపీఎం ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సహకారం కోరుతోందని, తోచిన సాయం అందించాలని అన్నారు. భవిష్యత్తులో ప్రజాసంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. ప్రజాపాలకులు చెబుతున్న హామీలను అమలు చేసేవరకు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు అజయ్ బాబు, ఆర్.మల్లేష్, ఎం.గోపాల్, మధు, ఎల్లయ్య, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీటీ పాయె.. కొత్తది రాకపాయె!

రెండేళ్లు దాటినా జాడలేని సిమెంట్ రోడ్డు పనులు

- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఇదీ వారాసిగూడ పోచమ్మ ఆలయం వీధి రోడ్డు దుస్థితి

బౌద్ధనగర్: అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా బౌద్ధనగర్ డివిజన్ ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. తవ్విన రోడ్లను అధికారులు అసంపూర్తిగా వదిలేస్తున్నారు. కొత్తగా రోడ్డు వేయడాన్ని విస్మరించారు. బౌద్ధనగర్ డివిజన్‌లోని వారాసిగూడ పోచమ్మ ఆలయం వీధిలో కొత్త డ్రైనేజీ పైపులైన్ వేస్తామని చెప్పి అప్పటికే ఉన్న బీటీ రోడ్డును రెండేళ్ల క్రితం తొలగించారు. అప్పటి నుంచి ఇసుక తేలిన, గుంతలుపడిన రోడ్డుపైనే వాహనచోదకులు, పాదచారులు రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రి సమయాల్లో వృద్ధులు, వికలాంగులు ఆ మార్గాన నడవలేక నానా అవస్థలు పడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సీవరేజీ, తాగునీటి పైప్‌లైన్ మరమ్మతుల నిమిత్తం రోడ్డును తవ్వారు. ఇంతవరకూ రోడ్డు పునరుద్ధరణ పనులేవీ చేపట్టకపోవడం గమనార్హం. గుంతలమయంగా మారిన రోడ్లలో డ్రైనేజీ, మురుగు నీరు చేరుతుండటంతో అందులోంచి దుర్గంధం వస్తోంది. దీంతో ఇళ్ల ముందు కూర్చోలేకపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, కార్పొరేటర్ కంది శైలజ కూడా ఈ సమస్యపై దృష్టి సారించకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మేయర్ ఆదేశించినా అంతే..

డివిజన్ సమస్యలు తెలుసుకునేందుకు ఈ నెల 9న నగర మేయర్ విజయలక్ష్మి బౌద్ధనగర్‌లో పర్యటించారు. ఆ సమయంలో పోచమ్మ దేవాలయం వీధిలో నూతన రోడ్డు వేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. అయినా కూడా ఇప్పటి వరకు అతీగతీలేదు. పోచమ్మ దేవాలయం వీధిలో గుంతల మయమైన రోడ్డుపై రాకపోకలు సాగించలేక నరకం అనుభవిస్తున్నామని అంకం భరత్ అనే స్థానికుడు ఆవేదన వ్యక్తం చేశారు.


పోచమ్మ దేవాలయం వీధిలో అసంపూర్తిగా రోడ్డు నిర్మాణ పనులు

వెంటనే పనులు ప్రారంభించాలి


రెండేళ్ల క్రితం బీటీ రోడ్డును తొలగించారు. ఇంతవరకు కొత్త రోడ్డు పనులు మొదలుపెట్టలేదు. ఇది అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ఇప్పటికైనా వెంటనే సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాలి.
– సాయి ప్రసాద్‌గౌడ్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు

పేదల జోలికొస్తే ఖబడ్దార్: తలసాని


ఫుట్‌పాత్ వ్యాపారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: పేదల ఉపాధి జోలికొస్తే తెగించి కొట్లాడతామని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హెచ్చరించారు. మంగళవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని కార్యాలయం వద్దకు రాంగోపాల్‌పేట, బేగంపేట, మోండా మార్కెట్ డివిజన్ల పరిధిలోని ఫుట్‌పాత్ వ్యాపారులు, హాకర్స్ పెద్ద సంఖ్యలో వచ్చి తలసానిని కలిసి తమ గోడు విన్నవించుకున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి చిన్న, చిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని, ఇప్పుడు వాటిని ట్రాఫిక్ పోలీసులు తొలగిస్తున్నారని, తాము ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబాలు రోడ్డున పడతాయని ఎమ్మెల్యే ఎదుట విలపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే తమకు ఈ కష్టాలు మొదలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. తలసాని మాట్లాడుతూ ఎవరూ ఆందోళన చెందవద్దని, చిరువ్యాపారులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని అన్నారు. ఈ నెల 23న జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు, టౌన్‌ప్లానింగ్ తదితర శాఖలకు చెందిన అధికారులతో కలిసి మినిస్టర్ రోడ్డు, జవహర్ జనతా, మోండా మార్కెట్ డివిజన్‌లలో పర్యటించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వివరించారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ మల్లికార్జున్‌గౌడ్, రాంగోపాల్‌పేట, మోండా డివిజన్ల బీఆర్‌ఎస్ నేతలు శ్రీహరి, శ్రీనివాస్‌గౌడ్, ఆకుల హరికృష్ణ, తలసాని సైకిలాబ్‌యాదవ్, నాగులు, రాములు, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యనగర్ సమస్యల పరిష్కారానికి కృషి


ఆర్యనగర్ సమస్యలపై అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి

లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ ఆర్యనగర్‌లో మంగళవారం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి పర్యటించారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా అసంపూర్తి కమ్యూనిటీ హాల్, గుంతలమయమైన రోడ్లు, డ్రైనేజీ పైపులైన్లు, స్ట్రీట్‌లైట్లు వంటి సమస్యలను ఆర్యనగర్ యూత్ నాయకులు కుమార్ షాను డిప్యూటీ మేయర్ సమక్షంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు డిప్యూటీ మేయర్ వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల సర్వేను అధికారులతో కలిసి పర్యవేక్షించారు. డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ సుభాష్, ఏఎంసీ హేమలత, ఏఈ వేణు, జలమండలి డీజీఎం సరిత, మేనేజర్ మురళి, స్థానిక నాయకులు బల్‌రాం, మంత్రి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా సీనియర్ సిటిజన్ల క్రీడాపోటీలు


సీనియర్ సిటిజన్ల క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న రజనీకాంత్‌రెడ్డి తదితరులు

సనత్‌నగర్: క్రీడాపోటీల్లో సీనియర్ సిటిజన్లు సందడి చేశారు. వారంతా ఉత్సాహంగా తరలివచ్చారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జీహెచ్‌ఎంసీ ఆసరా సర్కిల్–17 కమిటీ ఆధ్వర్యంలో మోడల్ కాలనీలో మంగళవారం సీనియర్ సిటిజన్లకు క్యారమ్స్ (సింగిల్, డబుల్స్), జనరల్ నాలెడ్జ్, చదరంగం, బ్రిస్క్‌వాక్, మ్యూజికల్ చైర్, టగ్ ఆఫ్ వార్ వంటి క్రీడల్లో పోటీలు నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్–17 ఉప కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడాపోటీల వల్ల వారి మధ్య ఐక్యతను పెంపొందించడంతోపాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. వారి ఆలోచనలు, అనుభవాలు సమాజహితానికి ఉపయోగపడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, ఆసరా సర్కిల్ కమిటీ ఉపాధ్యక్షుడు జేఎస్‌టీ సాయి, సీనియర్ సిటిజన్ల సంఘాల ప్రతినిధులు పార్థసారధి, అనంతరెడ్డి, మాణిక్యరావు పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి

కంటోన్మెంట్: నిరుపేదల వైద్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి సంజీవనిలా పనిచేస్తుందని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బోయిన్‌పల్లికి చెందిన ఉదయ్ యాదవ్, రసూల్‌పురాకు చెందిన పూజకు సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే మంగళవారం వారి కుటుంబసభ్యులకు అందజేశారు. బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ ద్వారా లబ్ధిదారులు ఎమ్మెల్యేను సంప్రదించగా, సీఎంఆర్‌ఎఫ్‌కు సిఫారసు చేశారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయి.

డ్రైవింగ్ సమయంలో హెల్మెట్ తప్పనిసరి



విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలను తెలియజేస్తున్న ఇన్‌స్పెక్టర్ రాంబాబు

లాలాపేట: పాఠశాల స్థాయి నుంచే ట్రాఫిక్ నియమాలను తెలుసుకోవడం ద్వారా భవిష్యత్‌లో రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని నల్లకుంట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు అన్నారు. ఈ మేరకు జాతీయ భద్రతా దినోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం రవీంద్రనగర్‌లోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో నల్లకుంట ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ చేసే సమయంలో తప్పకుండా తలకు హెల్మెట్ ధరించాలని, రోడ్డు ప్రమాదాల నుంచి దూరంగా ఉండాలనీ సూచించారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్‌తో కలిగే అనర్థాలను, విధించే జరిమానాల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నియమాలను తెలిపే ప్లకార్డులను విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

26 నుంచి వారోత్సవాలు


సమావేశంలో పద్మశాలి సంఘం నాయకులు

బౌద్ధనగర్: గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని గ్రేటర్ వారాసిగూడ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు బొమ్మ నరేందర్ తెలిపారు. మంగళవారం వారాసిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 1న మార్కండేయ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం, వృద్ధులకు పండ్ల పంపిణీ చేయనున్నట్లు వివరించారు. సమావేశంలో నాయకులు కడియాల బలరామ్, గోలి జనార్దన్, అల్లి గోవింద్, కల్లెపల్లి రాజు, బొమ్మ శ్రీధర్, దూస లక్ష్మి, ఎలూరి సత్యనారాయణ, వల్లపు కృష్ణమూర్తి, స్వదేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సహకారం: శ్రీగణేశ్


సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: మారేడుపల్లిలోని సుప్రసిద్ధ సుబ్రహ్మణ్య స్వామి దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వం తరఫున సహకారం అందిస్తామని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. వాసవీ కాలనీకి చెందిన కోడారపు కృష్ణ ఆలయ ప్రాంగణంలో ప్రతి మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చారు. తొలిరోజు కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సహకారానికి తోడు, భక్తుల విరాళాలతోనే ఆలయాల అభివృద్ధి కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ రేపాల వెంకటేశ్వర్లు, పాలకమండలి సభ్యులు రామ్మోహన్, నర్సింగ్, పరమేశ్, శ్రీనివాస్, పద్మజ, బాలరాజు, రాజేశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ పదోన్నతులు పొందిన ప్రొఫెసర్లను తొలగించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో అక్రమంగా పదోన్నతులు పొందిన ప్రొఫెసర్లను తొలగించాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అధ్యక్ష కార్యదర్శులు లెనిన్, నెల్లి సత్య మాట్లాడుతూ గత వీసీ ప్రొ.రవీందర్ హయాంలో సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతుల్లో అక్రమాలు జరిగాయని యూజీసీ నిర్ధారించినందున వారిని తొలగించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమంగా పదోన్నతులు పొందిన వారిలో మాజీ వీసీ, ఉన్నత విద్యమండలి మాజీ చైర్మన్ ఉన్నట్లు చెప్పారు. సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందినవారు నెలకు రూ.3.20 లక్షల వేతనంతోపాటు వివిధ అధికారిక పదవుల్లో కొనసాగుతున్నారని పేర్కొన్నారు. ఏఐఎస్‌ఎఫ్ నాయకులు భగత్, కళ్యాణ్, వంశీ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్‌లు నిర్వహించడం అభినందనీయం

- తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ
- వి.హనుమంతరావును అభినందించిన దీపాదాస్


రాజీవ్‌గాంధీ స్మారక అండర్–19 క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న దీపాదాస్ మున్షీ

అంబర్‌పేట: క్రీడలు ప్రాంతాలు, కుల మతాల మధ్య స్నేహ పూర్వక వాతావరణానికి దోహదపడతాయని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ అన్నారు. మంగళవారం అంబర్‌పేటలోని జలమండలి క్రికెట్ గ్రౌండ్‌లో రాజీవ్‌గాంధీ 18వ స్మారక అండర్–19 డే అండ్ నైట్ టీ–20 లీగ్ క్రికెట్ చాంపియన్‌షిప్–2025 పోటీలు ప్రారంభమయ్యాయి. క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ పోటీలను దీపాదాస్ మున్షీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇలాంటి క్రికెట్ టోర్నమెంట్‌లు ప్రతిభా ఉన్న పేద క్రీడాకారులకు ఎంతో దోహదపడతాయని అన్నారు. వీహెచ్ ఇలాంటి టోర్నమెంట్‌లు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. తమిళనాడు రాష్ట్ర ఎమ్మెల్యే జేఏ హసన్, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కమలాకర్‌రావు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శులు ఆర్.లక్ష్మణ్ యాదవ్, బోల్లు కిషన్, క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వర్కింగ్ ప్రెసిడెంట్ శంభూల శ్రీకాంత్‌గౌడ్, హైదరాబాద్ అధ్యక్షులు ఆది అవినాష్ పాల్గొన్నారు.

సర్వమత ప్రార్థన మందిరం ప్రారంభం



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ సెయింట్ ప్యాట్రిక్స్ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన సర్వమత ప్రార్థన మందిరాన్ని నాలుగు ప్రధాన మతాల ఆధ్యాత్మిక గురువులు కలిసి మంగళవారం ప్రారంభించారు. ఇస్కాన్ ఆలయ ప్రతినిధి శ్రీహరి కృష్ణ, మహేంద్రహిల్స్‌కు చెందిన బౌద్ధ గురువు బిక్కు బుద్ధపాల, సిక్కుల గురువు జ్ఞాన జగదేవ్‌సింగ్, ముస్లిం మత గురువు హఫీజ్, పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ రవిశేఖర్, ప్రిన్సిపాల్ ఫాదర్ ఎలాంగో, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ ఆంథ్రూ, జనార్దన్‌రెడ్డిలు పాల్గొన్నారు. విద్యార్థులందరికీ ఉమ్మడి ఆధ్యాత్మిక స్థలాన్ని ఏర్పాటు చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం


ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చిలకలగూడ: ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు మరింత అవగాహన కలిగి ఉండాలని చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాసులు సూచించారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని చిలకలగూడ సెయింట్ జోసెఫ్ స్కూలులో మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పాదచారులకు జీబ్రా క్రాసింగ్, ఫుట్ ఓవర్ బ్రిడ్జిల వినియోగం, మెట్రోస్టేషన్లు, సిగ్నలింగ్ వ్యవస్థ, ట్రిపుల్ రైడింగ్, ఓవర్ స్పీడ్, మైనర్ డ్రైవింగ్, హెల్మెట్ వినియోగం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్‌ఐ శ్రీధర్, సెయింట్ జోసెఫ్ పాఠశాల కరస్పాండెంట్ రఘు, హెచ్‌ఎం రాజేశ్వరీ, అధ్యాపకులు సౌజన్య, అనిత, రాణి, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

27 నుంచి 'ఖేలో భారత్' క్రీడాపోటీలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో ఈ నెల 27 నుంచి 31 వరకు ఏబీవీపీ ఖేలో భారత్ క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు అధ్యక్షులు దృహన్ తెలిపారు. మంగళవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట క్రీడాపోటీల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆసక్తి గల క్రీడా కారులు ఈ నెల 24 వరకు వివిధ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పృథ్వీతేజ, జీవన్, అలివేలి రాజు, కమల్ సురేష్, శేఖర్, తోట శ్రీనివాస్, గౌతం, కోటి, రమేష్, నిఖిల్, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.


వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఏబీవీపీ నేతలు

బల్కంపేటలో అగ్నిప్రమాదం



అమీర్‌పేట్: బల్కంపేట రేణుకానగరలోని గ్యాస్ గోడౌన్ సమీపంలో అగ్ని ప్రమాదం జరిగింది.కొందరు గుర్తుతెలియని వ్యక్తులు చెత్తను తగులబెట్టారు. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలను ఆర్పేశారు.

ఓయూ పూర్వ వైభవానికి కృషి

1977–88 నాటి విద్యార్థి సంఘాల నేతలు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ: యూనివర్సిటీల్లో ఎన్నికలు నిర్వహించాలని, ఓయూ పూర్వవైభవానికి కృషి చేస్తామని 1977–88 నాటి వివిధ కాలేజీల విద్యార్థి సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు అన్నారు. మంగళవారం ఓయూ ఏబీవీపీ పూర్వ అధ్యక్షులు, మెదక్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థి నాయకులు వీసీ ప్రొ.కుమార్‌తో సమావేశమై అనేక విషయాలు చర్చించారు. వర్సిటీ అభివృద్ధికి సలహాలు సూచనలతో 12 అంశాలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించి ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ ఓయూను అన్ని విధాలా బలోపేతం చేయడానికి అండగా ఉంటామన్నారు. ఓయూలో 1977–88 వరకు క్యాంపస్‌లోని ఆర్ట్స్, కామర్స్, సైన్స్, ఇంజినీరింగ్, బీఈడీ, న్యాయ కళాశాల, టెక్నాలజీ తదితర కాలేజీలలో వివిధ విద్యార్థి సంఘాల నుంచి ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు 280 మంది తొలిసారిగా సమావేశమైనట్లు తెలిపారు. యూనివర్సిటీల సమస్యల పరిష్కానికి విద్యార్థి ఎన్నికలు నిర్వహించాలని వీసీని కోరినట్లు చెప్పారు. సానుకూలంగా స్పందించిన వీసీ ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు కుబుసం సినిమా నిర్మాత ప్రదీప్‌రెడ్డి, రాజిరెడ్డి, డాక్టర్ సుధాకర్‌రెడ్డి, ఎంఏ ఖలీల్, ప్రొ. జగదీశ్వర్‌రావు, డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, నాయిని ప్రభాకర్, న్యాయవాది తుల రాజేందర్, బీఆర్‌ఎస్ నేత డాక్టర్ దాసోజు శ్రవణ్, డీవై శేషు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.


వీసీ ప్రొ.కుమార్‌ను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పర్యావరణ పరిరక్షణకు బద్రుక, సీజీఆర్ ఒప్పందం

కాచిగూడ: తెలంగాణ రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణ కోసం వివిధ కార్యక్రమాల నిర్వహణకు బద్రుక విద్యాసంస్థలు, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ (సీజీఆర్) మధ్య అవగాహన ఒప్పందం మంగళవారం జరిగింది. కాచిగూడలోని బద్రుక విద్యాసంస్థల ప్రధాన కార్యాలయంలో సొసైటీ కార్యదర్శి శ్రీకిషన్ బద్రుక, బద్రుక ఐటీ టెక్నాలజీ ప్రిన్సిపల్ డాక్టర్ డీవీఎస్ఎస్ మూర్తి, కామర్స్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ బి.మోహన్‌కుమార్, సీజీఆర్ అధ్యక్షుడు లీలా లక్ష్మారెడ్డి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ అవగాహన ఒప్పందం మేరకు పర్యావరణ పరిరక్షణ, వ్యవసాయ రంగం, జీవావరణ శాస్త్రం, వ్యర్థ పదార్థాల నిర్వహణ, పర్యావరణ క్లబ్బుల ఏర్పాటు, సెమినార్ల నిర్వహణ తదితర కార్యక్రమాలు సంయుక్తంగా నిర్వహించనున్నారు.

◆ ఈ సందర్భంగా శ్రీకిషన్ బద్రుక మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు తమ విద్యాసంస్థలు కట్టుబడి ఉన్నాయని అన్నారు. సీజీఆర్‌తో కలిసి మరిన్ని కార్యక్రమాలను నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.